ఆంధ్రజ్యోతి


andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.2 కనిష్ఠం 19.3

నిజామాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 10 నవంబరు 2024





జోరుగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లావ్యాప్తంగా 673 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కొన్న ధాన్యాన్ని 181 మిల్లులకు కేటాయించేందుకు నిర్ణయం
- ఒకటి రెండు రోజుల్లో ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు
- మద్దతు ధర ప్రకారం రైతుల ఖాతాల్లో డబ్బుల జమ
- కొనుగోళ్లు పూర్తైన సన్నరకానికి బోనస్ చెల్లింపు

నిజామాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జోరందుకున్నాయి. జిల్లావ్యాప్తంగా సన్న, దొడ్డు రకాలకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే నెలరోజులు ఆలస్యం కావడంతో ప్రతీరోజు 20వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు వారం రోజుల్లో లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. మిల్లర్లకు కేటాయింపులను చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఎలాంటి ఆరోపణలు లేని మిల్లులను గుర్తించి వాటికి జియో ట్యాగింగ్‌ను చేస్తున్నారు. మిల్లుల కెపాసిటీ ఆధారంగా ధాన్యాన్ని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో హమాలీలతోపాటు వాహనాలను సమకూర్చారు. మిల్లుల ట్యాగింగ్ పూర్తి కాగానే ప్రతీరోజు 500 వాహనాలకుపైగా పెట్టి కేటాయించిన మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏ-గ్రేడ్ క్వింటా ధాన్యం రూ.2320..

జిల్లాలో గడిచిన వారం రోజులుగా సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఏ-గ్రేడ్ క్వింటాకు రూ.2320, సాధారణ రకం రూ.2300లకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ప్రతీ ఏడాది అక్టోబర్‌లోనే ధాన్యం కొనుగోళ్లను చేపట్టి నవంబర్ చివరివారం లేదా డిసెంబర్ మొదటి వారంలో కొనుగోళ్లను పూర్తి చేసేవారు. ఈ ఏడాది ప్రభుత్వం ఆలస్యంగా నిర్ణయం తీసుకోవడంతో ఈ నెలలోనే ధాన్యం సేకరణ చేపట్టారు. ఇప్పటి వరకు జిల్లాలో 673 కొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వారం రోజుల్లో లక్ష మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో డిసెంబర్ 15లోపు ధాన్యం సేకరణ పూర్తి చేసేలా ఏర్పాట్లను చేశారు. అవసరమైతే మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించే విధంగా చర్యలను చేపడుతున్నారు. సన్న, దొడ్డురకాలకు వేర్వేరు కేంద్రాలను ఏర్పాటుచేసిన అధికారులు ప్రతీరోజు 15వేల నుంచి 20వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని సేకరిస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో దాదాపు ధాన్యం అమ్మకాలు పూర్తయినందున నిజామాబాద్, ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. తేమశాతం 17లోపు ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటున్నారు.

181 మిల్లులకు ధాన్యం కేటాయింపులు

జిల్లాలో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా ఏర్పాట్లుచేశారు. వాహనాలు సమకూర్చడంతోపాటు అన్నికొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులతోపాటు హమాలీలను అందుబాటులో ఉంచారు. ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో డిఫాల్ట్ ఉన్న మిల్లులను మినహాయించి ప్రస్తుతం 181 మిల్లులకు ధాన్యం కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మిల్లుల కెపాసిటీ ఆధారంగా వాటికి ధాన్యాన్ని కేటాయించనున్నారు. గత కొన్నేళ్ల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అన్నిమిల్లులకు ట్యాగింగ్ చేస్తున్నారు. ఆయా మిల్లుల కు ట్యాగింగ్ పూర్తికాగానే కొనుగోలు కేంద్రాలను కేటాయించి ధాన్యాన్ని ఒకటి రెండు రోజుల్లో తరలించనున్నారు. మిల్లు కెపాసిటీ రెండు టన్నులు ఉంటే 15వేల క్వింటాళ్ల ధాన్యం కేటాయించేందుకు నిర్ణయించారు. మిల్లుల కెపాసిటీ ఆధారంగా సరాసరి 60వేల క్వింటాళ్లకు పైగా ఒక్కొక్క మిల్లుకు ధాన్యాన్ని కేటాయించనున్నారు. ఈమిల్లులకు 10శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకున్న తర్వాతే ఈ కేటాయింపులను చేయనున్నారు. ఒకవేళ బ్యాంకు గ్యారంటీ మిల్లులు ఇవ్వకుంటే ధాన్యం విలువను బట్టి 25శాతం సెక్యూరిటీ డిపాజిట్‌చేస్తే ఈధాన్యాన్ని పూర్తిస్థాయిలో కేటాయింపులను చేయనున్నారు. ఇప్పటికే మిల్లర్లతో చర్చలు జరిపిన అధికారులు వారి నుంచి అఫిడవిట్‌లను తీసుకుంటున్నారు. వారికి పదిరోజుల పాటు సమయం ఇచ్చి గ్యారంటీలను తీసుకోనున్నారు.

ట్రాక్‌షీట్ ఆధారంగా రైతు వివరాలు, డబ్బుల జమ

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం మిల్లులకు తరలించగానే అక్కడి నుంచి వచ్చే ట్రక్‌షీట్ ఆధారంగా రైతు వివరాలను ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రైతు పేరు, సర్వేనెంబర్, పంట వేసిన ఎకరాలు, అమ్మినధాన్యం వివరాలను నమోదు చేస్తారు. ఆ వివరాల ఆధారంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో అమ్మిన ధాన్యం బట్టి డబ్బులను జమచేస్తారు. వారంరోజుల నుంచి కొనుగోలు చేస్తున్న అధికారులు ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలించగానే డాటాఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ధాన్యం కొనుగోలుకేంద్రాల ద్వారా అమ్మిన వివరాలను బట్టి మద్దతు ధరకు అనుగుణంగా రైతుల ఖాతాల్లో ఈ డబ్బులను వేయనున్నారు. ధాన్యం కొనుగోలు ఎక్కువ అవుతుండటంతో (మిగతా 8వ పేజీలో..)



వీసీలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు

సంక్షేమ ఫలాలు అందించేందుకే సమగ్ర కుటుంబ సర్వే

- కలెక్టర్లతో వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వపరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వర్తింపజేయాలనే సంకల్పంతో సమగ్ర కుటుంబ సర్వే జరిపిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. సర్వే విషయంలో ప్రజలు ఎలాంటి అనుమానాలకు గురికావాల్సిన అవసరంలేదని ప్రజల సందేహాలను నివృత్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి సర్వేను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియపై తన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి, ప్రణాళికశాఖ చీఫ్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియాలతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. హౌజ్‌విస్టింగ్ ప్రక్రియను పూర్తి చేసుకొని శనివారం నుంచి ఇంటింటి సమగ్ర సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతీ కుటుంబానికి సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని వాటిని నివృత్తిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్న ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని సర్వేపై ప్రజలతో మమేకం అయితే వారి సందేహాలు ఏమిటో అనేవి తెలుస్తాయని అన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనవకుండా ఎన్యూమరేటర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సర్వేప్రక్రియలో ప్రజలపట్ల ఎన్యూమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో భాగస్వామ్యం అయ్యేలా వారిని ఆహ్వానించాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతీఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించివారి ఆర్థిక అవృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందించేందుకు సర్వే ఉపయోగపడుతుందన్నారు. హౌజ్‌విస్టింగ్ దిగ్విజయంగా నిర్వహించారని అదే స్ఫూర్తితో సర్వే కూడా పూర్తయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వమార్గదర్శకాలను పాటిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లాలన్నారు. ఇంటింటి కుటుంబ సర్వే దేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమం అని సిబ్బంది నిబద్ధత, అంకిత భావంతో పనిచేస్తూ సర్వేను విజయవంతం చేయాలన్నారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలో చిట్టచివరి ఇంటివరకు చేరేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. సర్వే కోసం జారీచేసిన బుక్‌లెట్‌లోని అంశాలపై ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావులేకుండా ప్రజల నుంచి కచ్చితమైన సమాచారం సేకరణతో వివరాలు నమోదు చేయించాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, తదితరులున్నారు.

సమస్యల వలయంలో ఆదర్శ పాఠశాల

- కళాహీనంగా మల్లూర్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాల
- కూలిన ప్రహరీ.. అయినా నిర్మాణం చేపట్టిన అధికారులు
- రాత్రివేళ పందులు, పశువుల స్వైర విహారం
- అసౌకర్యాల మధ్య విద్యాబోధన



7

టీయూ లైబ్రరీలో పుస్తకాల కొరత




- అందుబాటులో లేని పోటీ పరీక్షల పుస్తకాలు
- మూసి ఉన్న గ్రంథాలయ గదులు
- అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విద్యార్థుల సంఘాల నాయకుల డిమాండ్

7

జిల్లాలో ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే

- జిల్లాలో మొత్తం 3,403 ఎన్యూమరేషన్ బ్లాక్‌ల ఏర్పాటు
- 15 రోజుల్లో పూర్తి కానున్న సర్వే



బోధన్‌లో చేపట్టిన సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

అమ్రాద్ గ్రామంలో సర్వేలో పాల్గొన్న ఆర్‌డీవో రాజాగౌడ్

నిజామాబాద్, నవంబరు9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే మొదలైంది. ఎన్యూమరేటర్లకు కేటాయించిన బ్లాక్‌లలో వివరాలను సేకరిస్తున్నారు. నిర్ణీత షెడ్యూల్‌లో సర్వేను పూర్తిచేసేలా పనులను మొదలు పెట్టారు. 15రోజుల్లో సర్వే పూర్తిచేయడంతోపాటు మొత్తం వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేసేలా ఏర్పాట్లను చేస్తున్నారు. సర్వేమొదలు పెట్టిన అధికారులు ప్రతీ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. కుటుంబానికి సంబంధించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కులసంబంధిత వివరాలను సేకరిస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఈ విధుల్లో పాల్గొంటున్నారు. ఒక్కొక్క బ్లాక్‌లో 150 నుంచి 175 వరకు ఇళ్లను కేటాయించడంతో సర్వే పూర్తిచేసేలా ఏర్పాట్లు చేశారు.

15 రోజుల్లో సర్వే పూర్తిచేయనున్న అధికారులు

జిల్లాలో మూడురోజుల పాటు ఇళ్లను లిస్టింగ్ చేసిన అధికారులు సర్వేను శనివారం మొదలుపెట్టారు. జిల్లావ్యాప్తంగా మూడురోజులపాటు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను వేసిన అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. నేటి నుంచి 15 రోజుల పాటు తమకు కేటాయించిన బ్లాక్‌లో ఉన్న ఇళ్లను పూర్తిస్థాయిలో కుటుంబ వివరాలను సేకరించేలా ఏర్పాట్లనుచేశారు. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలున్నాయి. వీటితో పాటు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిపరిధిలో మొత్తం 4లక్షల 70 వేలకు పైగా ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఇళ్లను ఆధారంగా చేసుకొని మొత్తం 3,403 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. ఈ బ్లాక్‌లో ఒక్కో సర్వేయర్‌ను ఎన్యూమరేషన్ కోసం నియమించారు. ఒక్కో బ్లాక్‌లో 150 ఇళ్లను నుంచి 175 ఇళ్లు ఉండేలా కేటాయించారు. ఇప్పటికే ఇళ్ల విస్టింగ్ చేసినందున వాటి ఆధారంగా ఎన్యూమరేటర్లు ప్రతీరోజు 10 నుంచి 15 ఇళ్ల వరకు ఈ సర్వేను చేయనున్నారు. సర్వేలో భాగంగా మొత్తం బ్లాక్‌కు ఒక సర్వేయర్‌ను నియమించిన అధికారులు అదనంగా కూడా 150మందికి పైగా ఎన్యూమరేటర్లను ఉంచారు. వీరితోపాటు సర్వేకోసం ఒక్కో బ్లాక్‌ను పరిశీలించేందుకు 10మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించారు. వీరిని పర్యవేక్షించేందుకు మండలస్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించారు. 33 మండలాలకు నియమించారు. వీరితోపాటు జిల్లా నోడల్ అధికారిగా అదనపుకలెక్టర్ అంకిత్‌ను నియమించారు. మొత్తం 74 అంశాలకు సంబంధించిన వివరాలను తీసుకుంటున్నారు. సర్వేకు వెళ్లినఇంటి పెద్దకు సంబంధించిన ఆధార్ నెంబర్‌ను మొదట తీసుకుంటారు. ఆ నెంబర్ ఆధారంగా మిగతా వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమాని చేసే వృత్తి, కులం, ఉద్యోగం అయితే ఆ వివరాలు, వ్యాపారం, వ్యవసాయం, ఇతర వివరాలను తీసుకుంటారు. ఆ కుటుంబానికి సంబంధించిన సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమానితో పాటు కుటుంబ సభ్యులకు సంబంధించిన విద్య వివరాలను తీసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందితే ఆ వివరాలు నమోదు చేస్తున్నారు. రుణాలు, ఆస్తుల వివరాలు, ఎవరైనా రాజకీయ పదవుల్లో ఉంటే ఆ వివరాలు నమోదు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చే వివరాలు మాత్రమే పొందుపరుస్తున్నారు. ఇవ్వని వివరాలను వదిలి వేస్తున్నారు. ఈ వివరాలను డాటా ఎంట్రీల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ సర్వే పూర్తి చేసే విధంగా ఏర్పాట్లను చేశారు. నేటి నుంచి సర్వే ప్రారంభించామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. సర్వేను 15రోజుల్లో పూర్తిచేయడంతోపాటు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. సర్వేను పకడ్బందీగా జరిగే విధంగా ఏర్పాట్లను చేశామని కలెక్టర్ వెల్లడించారు.

- పర్యాటకంగా అభివృద్ధి చెందని కందకుర్తి (స్కాందకుడతి)
- ప్రముఖుల సందర్శనలకే పరిమితమవుతున్న వైనం
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న ప్రజలు



పర్యటనలే తప్ప పట్టింపేది?

రెంజల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. తెలంగాణలో గోదావరి ముఖద్వారం, త్రివేణి సంగమంతోపాటు ఎన్నో పురాతన ఆలయాలున్న పుణ్యక్షేత్రం కందకుర్తి. ఇంత ప్రత్యేకత ఉన్న కందకుర్తి పర్యాటక అభివృద్ధిపై పాలకులు శీతకన్ను ప్రదర్శిస్తుండడంపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంఘ్ పరివార్ తీర్థ క్షేత్రం..

ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు కేశవ్‌రాం బలిరాం హెగ్డేవార్ డాక్టర్ జీ పూర్వీకుల గ్రామం ఇక్కడే. డాక్టర్ జీ మొదటగా సంఘ్ శాఖను ప్రారంభించారు. దీంతో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు కందకుర్తిలో డాక్టర్ జీ పూర్వీకుల స్థలంలో కేశవ స్మృతి మందిరం నిర్మించగా నాటి సంఘ పెద్దలు ప్రారంభోత్సవం చేశారు. దీంతో పాటుగా కేశవ శిశు మందిర్ నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సంఘ్ స్వయం సేవకులు, సంఘ్ పరివార్ వివిధ క్షేత్ర బాధ్యులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తుంటారు. వీరితో పాటు బీజేపీ అది నాయకులు అద్వానీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ కేంద్రమంత్రి హన్సరాజ్ గంగారాంతో పాటు ఎందరో ముఖ్య నాయకులు ఈ క్షేత్రాన్ని సందర్శించారు.

నేడు కందకుర్తికి హర్యానా గవర్నర్ రాక

రెంజల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రానున్నట్లు కందకుర్తి గ్రామస్థులు తెలిపారు. హెగ్డెవర్ పూర్వీకుల గ్రామమైన కందకుర్తి గ్రామంలో నిర్మిస్తున్న స్మృతి వనాన్ని సందర్శించేందుకు రానున్నట్లు వారు తెలిపారు.

కందకుర్తి ఆధ్యాత్మిక చరిత్ర..

మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కందకుర్తి ఎన్నోచారిత్రక ఆనవాళ్లకు, ఆధ్యాత్మిక చరిత్రకు సజీవసాక్ష్యం. స్కంద మహర్షి తపస్సు చేయడంతో ఈ ప్రదేశాన్ని స్కంద కుడతి అని పిలిచేవారని, దీంతోపాటు మూడునదులు కలిసేచోటును కుడతి అని పిలుస్తారు. స్కంద కుడతి రానురాను కందకుర్తిగా మార్పు చెందిందని గ్రామస్థులు చెబుతుంటారు. కందకుర్తి ఎన్నో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలకు నెలవై ఉంది. త్రేతాయుగంలో శ్రీరాముడు వనవాసంలో ఈ త్రివేణి సంగమంలో ప్రత్యేక పూజలు నిర్వహించాడని పురాణాలు చెబుతున్నాయి. రామాలయం దేవత మూర్తులున్నాయి. శ్రీరాముడే రామాలయానికి విగ్రహాలు అందించారని ప్రతీతి. గోదావరి పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేవారు. ఇప్పటికీ పుణ్య తిథుల్లో భక్తులు గోదావరిలో

మిగతా 8వ పేజీలో...



- విఠలేశ్వర్ కేశవనాథ్ ఆలయం

సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు అపోహలు చెందొద్దు

● సర్వేకు ప్రజలందరూ సహకరించాలి ● సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి ● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఆచన్‌పల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు చెందవద్దని, సర్వేకు ప్రజలందరు సహకరించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో బోధన్ మండలంలోని అమ్దాపూర్‌తో పాటు పట్టణంలోని 8,9,15,16వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమలేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్యూమలేటర్లు పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని ఏ ఒక్క నివాసం గృహం మినహాయించకుండా ప్రతీ ఇంటికి ఎన్యూమలేటర్లు సర్వే చేయాలన్నారు. పట్టణంలోని అన్ని వార్డులతో పాటు నియోజకవర్గంలోని నవీపేట, రెంజల్, ఎడపల్లి, సాలూర, బోధన్ మండలాలలోని అన్ని గ్రామ పంచాయతీ రికార్డుల ఆధారంగా ఎన్యూమలేటర్లు ప్రతీ ఇంటికి సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా సర్వే నిర్వహించాలన్నారు. సమగ్ర కుటుంబ వివరాల సేకరణ సర్వే బృందానికి నిర్ణీత సమాచారం అందజేస్తూ ఇంటింటా కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల గణన సర్వే కోసం ఎన్యూమలేటర్లు వివరాలు సేకరిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం ఈ సర్వేను ప్రారంభించినట్లు వెల్లడించారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి సర్వే ఎంతో దోహదపడుతుందన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక ఉపయోగాల కోసం ఈ సర్వే మేలు చేస్తుందన్నారు. సర్వేకు వచ్చే ఎన్యూమలేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకు సంధ్యదాము, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, తహసీల్దార్ విఠల్, కమిషనర్ వెంకట నారాయణ, పాషామొయినోద్దీన్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి : ఆర్డీవో రాజాగౌడ్

ఆర్మూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. శనివారం ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో సమగ్ర కుటుంబ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఒక్కోక్క ఇంటికి ఎంత సమయం పడుతుంది, సర్వే చేయడంలో ఇబ్బందులు ఎదురవుతు న్నాయా అని పంచాయతీకార్యదర్శి హారికను అడిగితెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి వివరాలను సేకరించి పొందుపర్చాలని ఆర్డీవో సూచించారు. ఆర్డీవో వెంట మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, అధికా రులు ఉన్నారు.

● సమన్యాయం కోసమే సమాగ్ర సర్వే

ఆర్మూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతో ప్రజలందరికి సమన్యాయం జరుగుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. ఈ సర్వే ద్వారా సమగ్ర కుటుంబం, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కులగణన వివరాలతో కూడిన పొందుపర్చిన సమగ్ర సర్వే బుక్‌లెట్‌పై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్, వైస్‌చైర్మన్ షేక్‌మున్న, మున్సిపల్ కమిషనర్ రాజు, సాయి బాబాగౌడ్, కౌన్సిలర్‌లు కొంతం మంజుల, వనంశేఖర్, బాగ్యలక్ష్మీ, మాజీవైస్ చైర్మన్ లింగాగౌడ్, ఎస్‌కె.బబ్లు, అధికారులు పాల్గొన్నారు.

● సమగ్ర కుల గణన ఇంటింటి సర్వే సహకరించాలి

వేల్పూర్:రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సమగ్ర కుల గణన



ఎల్లారెడ్డిలో ఎన్యూమరేటర్లకు సర్వే పత్రాలు అందజేస్తున్న దృశ్యం

సర్వేకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎంపీడీవో బాలకిషన్ సూచించారు. శనివారం మోతె, పచ్చలనడ్కుడ గ్రామాలలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే ఆయన పరిశీలించారు.సర్వే కోసం ఇంటికి వచ్చే ఎన్యూ మారేటర్‌లకు వారి అడిగే ప్రశ్నాలకు పూర్తిస్థాయిలో వివరాలు తెలపాలన్నా రు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎన్యూమారేటర్‌లు, ఉన్నారు.

కుటుంబ సర్వేకు మండల ప్రజలు సహకరించాలి

● మండల అభివృద్ధి అధికారి శంకర్

ఎడపల్లి: ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటీ కుటుంబ సర్వేకు మండల ప్రజలు తమవంతు సహకారం అందించాలని మండల అభివృద్ధి అధికారి శంకర్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలో ఇంటింటీ కుటుంబ సర్వే చేపడుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే కమ్మర్‌పల్లి మండలం లోని గ్రామాలలో కొనసాగుతోంది. ఈ మేరకు ఆయా గ్రామాలకు నియమించబడిన ఎన్యూమరేటర్లు సంబంధిత అధికారులు, నాయకులు సంయుక్తంగా శనివారం ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సర్వేను తీరును మండల తహసీల్దార్ ఎంఅంజనేయులు, ఎంపీడీవో రాజాశ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● పకడ్బందీగా సర్వే చేయాలి

ధర్పల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):పకడ్బందీగా సర్వే చేయాలని ఇన్యూమరేటర్లకు ఎండివో బాలకృష్ణ సూచించారు. శనివారం మండలంలో జరుగుతున్న సర్వేను ఆయన గోవింద్‌పల్లిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారాన్ని పొందుపర్చాలని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభమైందని మండల ప్రజలు సర్వేకు సహకరించాలని సూచించారు.

సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగద్దు: మండల స్పెషల్ ఆఫీస్

డిచ్‌పల్లి: ప్రభుత్వం ఎంతో మహోన్నత ఆశయంతో చేపట్టిన సమగ్ర కులగణన సర్వేలో ప్రతి కుటుంబాన్ని ఎలాంటి తప్పిదాలు లేకుండా కుటంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని మండల ప్రత్యేక అధికారి యోహాన్, తహసీల్దార్ ప్రభాకర్ లు ఆదేశించారు. శనివారం బీబీపూర్ గ్రామంలో సర్వే వివరాలను తనిఖీ చేసి ఎన్యూ మలేటర్‌ల పనితీరును పరిశీలించారు. ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిం చాలని వారు ఎన్యుమలేటర్ లను ఆదేశించారు. వీరి వెంట ఎంపీడీవో రవీందర్, ఆర్ఐ సంతోశ్ ఉన్నారు.

● కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నాగిరెడ్డి పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మండలంలోని పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎంపీడీవో ప్రభాకర్ చారి ఎన్యూమరేటర్లను కోరారు. ఆయన శనివారం మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటింటికి తిరిగి కుటుంబాల సర్వేను నిర్వహించాలని ఆయన కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కుటుంబ సర్వే ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. ఇది వరకు మండలంలో 9,145 కుటుంబాలున్నట్లు గుర్తించగా, మండలంలో మూడు రోజుల పాటు జరిగిన కుటుంబాల గుర్తింపు సర్వే ద్వారా మండలంలో మొత్తం 10,076 కుటుంబాలున్నట్లు గుర్తించామన్నారు. మండలంలో అన్ని ఎన్యూమారేటర్ బ్లాక్‌లలో సర్వే ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు.

● ఇంటింటి సర్వే పరిశీలించిన అధికారులు

మద్నూర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే ఉమ్మడి మద్నూర్ మండలంలో కొనసాగుతుంది. శనివారం సర్వేను మద్నూర్ మండల తహసీల్దార్ ఎం.డి. ముజీబ్, ఎంపీడీవో రాణిలు పరిశీలించారు. సర్వే వల్ల వస్తున్న సమస్యలు, ప్రజల స్పందనను సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ సర్వేలో పాల్గొనాలని కోరారు. సర్వే వలన రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల ఆర్థిక, సామాజిక అంశాలను అధ్యయనం చేసి ప్రజలకుమేలు చేయాలని సంకల్పించినందున అందరూ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేకు సహకరించాలని కోరారు. సర్వే పరిశీలన కార్యక్రమంలో మండల గిర్దావర్ శంకర్, మద్నూర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి సందీప్‌లు పాల్గొన్నారు.

● సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

భిక్కనూరు: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని భిక్కనూరు మండల ప్రత్యేక అధికారిణీ రజిత అన్నారు. శనివారం భిక్కనూరులో ప్రారంభమైన సర్వే కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారిణీ మాట్లాడుతూ సర్వేలో బాగంగా అధికారులకు ప్రజలు సహకరించాలని, అధికారులు ప్రతి విషయాన్ని ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఆర్ఐ బాలయ్య, ఆయాగ్రాపంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సమగ్ర సర్వే ప్రక్రియ నిబద్ధతతో చేయాలి

లింగంపేట: ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక సమగ్ర సర్వే ప్రక్రియ నిబద్ధతతో ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని ఎంపీవో మలహరి అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండలంలోని ముస్తాపూర్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లకు కుటుంబ సభ్యులు పూర్తి సమాచారాన్ని అందించి సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట పంచాయితీ కార్యదర్శులు ఉన్నారు.

● ఎన్యూమరేటర్లకు సర్వే పత్రాలు అందజేసిన మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల పరిధిలో సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన సర్వే పత్రాలను ఎన్యూమరేటర్లకు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కమిషనర్ శ్రీహరి రాజు అందజేశారు. సమగ్ర కుటుంబ సర్వే ఇంటింటికి తిరిగి ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రకాష్ ఎన్యూమరేటర్లకు సర్వే పత్రాలను అందజేశారు. కుటుంబ సభ్యుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు.

● సర్వేలో ప్రజలందరిని భాగస్వాములు చేయండి

పెద్ద కొడప్‌గల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక, సామాజిక, కులగణన సర్వేలో ప్రజలను భాగసామలు చేయాలని మండల ప్రత్యేక అధికారి కిషన్ అధికారులకు సూచించారు, పెద్ద కొడప్‌గల్ గ్రామంలో శనివారం చేపట్టిన సర్వేతీరును ఎంపీడీవోతో కలిసి పరిశీలించారు, ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఆయా గ్రామాలలో సర్వేకు అర్హులైన వారి ఇండ్లకు స్టిక్కర్ వేయడం జరిగిందని. ఇంక ఎవరి ఇంటికైనా స్టిక్కర్ వేయకపోతే సంబంధిత గ్రామ పంచాయితీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. సర్వే సిబ్బంది ఇక నుండి గ్రామాలలో ఇంటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తారని, ప్రజలు సర్వేకు సహకరించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతుంది. మండలంలోని నాగేపూర్‌లో జరిగిన సర్వేను శనివారం మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ పరిశీలించారు. సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, తదితరులున్నారు.

సమగ్ర సర్వే విజయవంతం చేయాలి

మాక్లూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని ఆర్డీవో రాజేంద్రకుమార్ కోరారు. శనివారం మండలంలోని అమ్రాద్ గ్రామంలో సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు ఇంటింటికి తిరుగుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ



ఏర్గట్ల పోలింగ్ బూత్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీలత

ఏర్గట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి):ఓటర్ల జాబిత ప్రత్యేక సవరణ లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లలో ఫా రం 6,ఫారం7, ఫారం 8 దరఖాస్తులను తహసీల్దార్ శ్రీలత స్వీక రిం చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శని, ఆదివారాల్లో ప్ర త్యేక ఓటరు నమోదు నిర్వస్తున్నామని, జనవరి 1 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత, కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందు కు, సవరణకు, వెలువడిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలిపేం దుకు బూత్ లెవల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటారన్నారు. ఇట్టి అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సదానంద్, సీనియర్ అసిస్టెంట్, బీఎల్ వోలు వెంకటేష్‌లు పాల్గొన్నారు.

18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు..

నవీపేట: 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులందరు ఓటు హక్కు కోసం తమ పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వెంకట రమణ కోరారు. శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని ఆయన మండలంలోని నాగేపూర్, రాంపూర్, ఫత్తేనగర్‌లలో పరిశీలించారు. 01-01-2025సంవత్సరం నాటికి 18సంవత్సరాలు నిండిన యువతి, యువకులందరు ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కోటగిరి: కోటగిరి మండలంలోని పలు గ్రామాలలో శనివారం ఓటరు జాబితాపై ప్రత్యేక సవరణ కార్యక్రమం నిర్వహించారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లి, లింగాపూర్, ఎత్తొండ, ఎక్లాస్‌పూర్ గ్రామాలలో తహసీల్దార్ గంగాధర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. 2025 జనవరి 1నాటికి 18ఏళ్లు నిండే వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాలలో ఓటు హక్కు లేని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పచ్చలనడ్కుడలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న నర్సారెడ్డి

వేల్పూర్, నవంబరు9(ఆంధ్రజ్యోతి):మండలంలోని పచ్చలనడ్కుడ, కొత్తపల్లి(ఎన్) గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. పచ్చలనడ్కుడకు చెందిన కొప్పుల సుకన్య, కొప్పుల లక్ష్మీ, కొత్తపలి(ఎన్)కు చెందిన గడ్డం నర్సవ్వలకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అంద జేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ టక్కరిగంగాధర్, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు లింగేశ్వర్, నాయకులు గంగ భూమన్న, నెహ్రూ, హాలిం, చేపూర్ మోహన్, మండల భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

కల్లూర్‌లో గడ్డివాముల దహనం

కోటగిరి,నవంబరు9(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు గడ్డివాములు దహనమయ్యాయి. గ్రామానికి చెందిన గంగాధర్, హర్షవర్ధన్‌లకు చెందిన గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు 50వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు.

ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కమ్మర్‌పల్లి, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి) డాక్టర బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాల యంలో 2024-25 విద్యా సంవత్సరానకుగాను నేరుగా ప్రవేశం పొందడానికి అసక్తిగల విద్యార్థులు దరకాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభ్యాసకుల కేంద్రం మెట్‌పల్లి కో-ఆర్డినేటర్ బిల్లా రాజేందర్, సీనియర్ అకాడమిక్ కౌన్సిలర్ కడకుంట్ల దశరథం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియట్ పాస్ లేదా అందుకు సమానమైన ఇంటర్మీడియట్ నేషనల్ స్కూల్, తెలంగాణ, ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ, పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల కోర్సు ఐటీఐ, డైరీవొకేషన్, ఓఎ, ఈఈటీ వంటి కోర్సులు పాసైన వారు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందుటకు అవకాశం ఉందన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీఆర్ట్స్, కంప్యూటర్ గ్రూప్‌లలో డిగ్రీమొదటి సంవత్సరం (ఇంగ్లీష్/తెలుగు మీడియం)లో ప్రవేశం పొందడానికి సంబంధిత ఫీజుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత ఫీజులు మీసేవా ఆన్‌లైన్ సెంటర్లలలో చెల్లించివాటికి సంబంధించిన రశీదును, స్టడీ సర్టిఫికెట్‌లు రెండు సెట్ల జీరాక్స్ సంబంధిత అభ్యాసకుల కేంద్రంలో అందజేయాలన్నారు. డిగ్రీ రెండు, మూడో సంవత్సరం ఫీజుల చెల్లించడానికి ఈనెల 15 వరకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని విద్యారు లు సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాలకోసం 7569841742 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ మృతి

ఎడపల్లి, నవంబరు09(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన పల్లికొండ సాయిలు(41) రోడ్డు ప్రమాదంలో గాయపడి చకిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎడపల్లి గ్రామ శివారులోని బాలికల గురుకుల పాఠశాల ఎదురుగా బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై గురువారం మహారాష్ట్రకు చెందిన ఆర్టీసి బస్సు ఢీకొనగా తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవీపేట,నవంబరు9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నందిపేట రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ శివ పంచాయాతన శివాలయం విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలకు హజరుకావాలని కోరుతూ శనివారం ఆలయ కమిటీ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ నెల 17నుంచి 21వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు కొనసాగనున్నాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో గొల్ల ప్రవీణ్, ప్రసాద్, నర్సయ్య, గోపాల్, సంజీవ రెడ్డి తదితరులున్నారు.

హసాకొత్తూర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

కమ్మర్‌పల్లి, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి) మండలంలోని హసాకొత్తూర్‌లో శనివారం తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరికి పాల్పడినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై తెలిపారు. గ్రామానికి చెందిన నాయిని పురుషోత్తం శనివారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మోర్తాడ్ మండలం దోన్కల్ గ్రామానికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తాళంపగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో దాచిన 8 తులాల బంగారునగలు అపహరంచుకుపోయినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గ్రామానికి వెళ్లి పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

గోవులను పూజించే సంస్కృతి భారతదేశంలోనే ఉంది

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



గోపూజ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):గోవును పూజించే సంస్కృతి ఒక్క భారతదేశంలోనే ఉందని అంత గొప్పనైన సంస్కృతిలో మనం ఉన్నందుకు గర్వపడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శనివారం నగరంలోని గోపాల్ బాగ్ గోశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గోపాష్టమి మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల దేవతలకు నిలయమై ఉండే గో మాతను పూజించడం ప్రపంచంలోని భారతదేశంలో మాత్రమే ఆ సంస్కృతి ఉందని అన్నారు. హిందూ ధర్మంలో గోమాతను పూజించడం గోవును ఇంట్లో ఉంచుకోవడం గోవు ద్వారా వచ్చేటువంటి ఉత్పత్తులను స్వీకరించడం నాటి నుండి వస్తుందని అన్నారు. గోమాతను పూజించడం వల్ల ఎన్నో రోగాలు రావని తల్లిపాలతో సమానమే గోవు పాలు అని అన్నారు. గోవులు అనారోగ్యం, యాక్సిడెంట్లు అయినా తన ట్రస్ట్ ద్వారా వాహన సర్వీసు అం దించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌బాగ్ గోశాల కమిటీ అధ్యక్షుడు రామ్, కార్యదర్శి మాస్టర్ శంకర్, కమల్ ఇనాని, ధన్‌పాల్ శ్రీనివాస్, కైలాష్ బోయెంకర్, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ స్వామిరెడ్డి

జక్రాన్‌పల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు తప్పనిసరి వేయించాలని రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ స్వామిరెడ్డి అన్నారు. శనివారం జక్రాన్‌పల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పశువలకు గాలికుంట వ్యాధి నివారణ వేశారు. పశుసంవర్ధక శాఖకు చెందిన రికార్డులను ఆయన పరిశీలించారు. నివారణ టీకాలకు సంబంధించి మండలంలో చేపడుతున్న కార్యక్రమ వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. 128 ఆవులకు, 366గేదేలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహయ సంచాలకులు డాక్టర్ గంగధరయ్య, డాక్టర్ బస్వారెడ్డి, కిరణ్‌దేశ్‌పాండే, పశువైద్యాధికారిణి డాక్టర్ హర్షిత, జూనియర్ పశువైద్యాధికారిణి శశికళ, గోపాల మిత్రలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపూర్‌లో..

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసినట్టు పశు వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే, డాక్టర్ ఉమామాసాహెర్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యా సిబ్బంది గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని రాస్తారోకో



నందిపేట కొత్త బస్టాండ్ ఎదుట ధర్నా చేస్తున్న శాపూర్ గ్రామస్థులు

నందిపేట, నవంబరు 9: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఏదుట శనివారం శాపూర్‌కు చెందిన కొమిరె సుధాకర్‌తో పాటు గ్రామస్తులు, మద్దతుదారులు రాస్తారోకో చేశారు. నిందితులు అందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 3న మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలో బైక్, కారు డీకొట్టిన సంఘటనలో మధ్యవర్తిగా పోయిన తనపై సుమారు 25 మంది దాడి చేసి, పూర్తిగా గాయపరిచారని, కులం పేరుతో దూషించారని బాధితుడు సుధాకర్ తెలిపారు. ఈ విషయంలో నందిపేట పోలీసులకు 25 మందిపై పిర్యాదు చేయగా 18 మందిపై మాత్రమే కేసు నమోదు చేసినట్లు తెలిపారని పేర్కొన్నారు. వాస్తవానికి 9 మందిపై కేసు నమోదు చేశారని, వారిని కూడా ఇంత వరకు అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. తనపై దాడి చేసిన అందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని బీఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు కొమిరె సుధాకర్ డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆర్మూర్ రూరల్ ఎస్ఐ శ్రీధర్ రెడ్డి జోక్యం చేసుకొని విచారణ చేస్తున్నామని, రెండు, మూడు రోజుల వ్యవధి కావాలని కోరారు. దింతో ఆందోళన కారులు శాంతించి రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సింగడే పాండు, కామారెడ్డి అధ్యక్షులు ఈశ్వర్, బీఎస్‌పి, ఏవైఎస్ నాయకులు బోర్రెళ్ళ సురేష్, బొంత సురేష్, శ్రీను, మురళి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు తమ లక్ష్యం కోసం పాటుపడాలి

● సీనియర్ సివిల్‌జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యం కోసం నిరంతరం పాటుపడాలని సీనియర్ సివిల్‌జడ్జి నసీం సుల్తానా సూచించారు. శనివారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. అలాగే న్యాయ వ్యవస్థలోని చట్టాలతో పాటు పలు విషయాలపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగామణి, న్యాయవాదులు జీజీరాం, మోహన్, సుకేష్ పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచేడ భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు.

బాలోత్సవ కార్యక్రమానికి విద్యార్థులు తరలిరావాలి

డిచ్‌పల్లి,నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12,13 వ తేదిల్లో మోపాల్ శివారులో గల ప్రెసిడెన్సి పాఠశాలలో నిర్వహించే బాలోత్సవ్ కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ కోరారు.

సలాబత్‌పూర్ వరకు ప్రభాత్‌భేరి

మద్నూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండల కేంద్రం నుంచి భక్తులు శనివారం సలాబత్ పూర్ ఆంజనేయ స్వామి ఆలయానికి పాదయాత్రతో ప్రభాత్‌భేరిగా వెళ్లారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రభాత్‌భేరి గత నెల రోజుల నుంచి మద్నూర్‌లో ఉన్న అన్ని ఆలయాల దర్శనం చేసు కుంటున్నారు. మంగళ హారతులు చేస్తూ నిత్యం ప్రభాత్‌భేరి చేస్తూ వస్తున్నారు. అయితే శనివారం మద్నూర్ నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో హనుమాన్ ఆలయం వరకు భక్తులు పాదయాత్రతో భక్తి భజన పాటలు పాడుతూ కాలినడకన వెళ్లారు. హనుమాన్ ఆలయంతో పాటు సరిహద్దులో ఉన్న శివాలయంలో కూడా హారతులు చేశారు. అనంతరం బాలాజీ మందిర్ ఆలయంలో మంగళ హారతులు, భక్తిశ్రద్ధలతో చేస్తున్నారు. భక్తిని చాటుకుంటుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన జిల్లానాయకులు



గోపిచంద్‌ను కలిసిన జిల్లా నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లెల గోపిచంద్‌ను శనివారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు, ప్రధానకార్యదర్శి సందీప్‌గౌడ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు ఆఫిలియేషన్ గుర్తింపు రావడం పట్ల రాష్ట్ర అధ్యక్షుని కృతజ్ఞతలు తెలిపామని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముప్కాల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బొట్ల రవి కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.35వేల చెక్కును శనివారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర విత్తనాభివృద్ధి శాఖ చైర్మన్ అన్వేష్‌రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, జిల్లా అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డిలకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియ జేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

ముప్కాల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం రెంజర్ల గ్రామానికి చెకందిన మాజీ సర్పంచ్ గద్దల భూమేశ్వర్ తండ్రి ఎర్రన్న మృతి చెందగా శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి సంతాపం తెలిపారు.



● కూలిన మల్లూర్ హైస్కూల్ ప్రహరీ

సమస్యల వలయంలో ఆదర్శ పాఠశాల!

● కళావిహీనంగా మారిన మల్లూర్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాల ● అభివృద్ధి పనుల కోసం రూ.3.90 లక్షల నిధుల మంజూరు ● కేవలం రూ.90 వేలతోనే పనులు ● మూత్రశాలలు, మరుగుదొడ్లపై రేకులను తొలగించి స్లాబ్ నిర్మాణం ● అదనంగా విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం ● కూలిన ప్రహరీ.. అయినా నిర్మాణం చేపట్టని అధికారులు ● పందులు, పశువుల స్వైరవిహారం.. రాత్రివేళ అక్కడే మకాం ● పాఠశాలలో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 135 మంది బాలబాలికలు ● ఇదీ మల్లూరు హైస్కూల్ పరి(దు)స్థితి!!

ఆంధ్రజ్యోతి పరిశీలన



● నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

నిజాంసాగర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాల కళావిహీనంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని విద్యాభ్యాసం చేసే బాలబాలికలు, తల్లిదండ్రులు వాపోతున్నారు. నిజాంసాగర్ మండలం మల్లూరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యల వలయంలో కొట్టామిట్టాడుతోంది. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు మొత్తం 135 మంది బాలబాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద రూ.3 లక్షల 90 వేలు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో నుంచి కేవలం రూ.90 వేలతో మరుగుదొడ్లు, మూత్రశాలలుపైన ఉన్న రేకులను తొలగించి స్లాబ్ నిర్మాణం చేపట్టారు. అలాగే, పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థుల కోసం తాగునీటి వసతిని కల్పించారు. పాఠశాల ప్రహరీ ముందు భాగం నుంచి మొదలుకొని.. పాఠశాలకు ఇరువైపులా కూలిపోయింది. కాగా, ఈ పాఠశాలకు వెళ్లేందుకు గతంలో సీసీ రోడ్డు నిర్మాణం కూడా చేపట్టారు. అయితే, ఈ రోడ్డు చేపట్టినప్పటికీ ప్రహరీ కూలిపోయినా.. నిర్మాణం చేపట్టాలనే ఆలోచన లేకపోవడం గమనార్హం. దీంతో కూలిన పాఠశాల ప్రహరీ చూపరులను వెక్కిరిస్తోంది. ఈ విషయమై సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పాఠశాల నిర్మాణ నిర్మాణ దశలో వేసిన కలర్‌లు ఉన్నాయి తప్ప.. కొత్తగా పాఠశాలకు రంగులు వేసి తీర్చిదిద్దకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన రూ.3లక్షల 90వేలల్లో కేవలం రూ.90 వేలు మంజూరు కావడం విశేషం. మిగతా రూ.3 లక్షలు మంజూరు కోసం ఎదురుచూస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికీ నిధులు మంజూరు చేయలేకపోవడంతో ప్రహరీ నిర్మాణం చేపట్టలేకపోతున్నారు. ప్రహరీ కూలిపోవడంతో గేట్లను కూడా ఉపాధ్యాయులు పక్కన పెట్టించారు తప్ప.. ప్రహరీ నిర్మాణానికి జిల్లా అధికారులు దృష్టికి తీసుకుపోయినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైనా నిధులు రాకపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు అమ్మ ఆదర్శ పాఠశాలకు నిధులు మంజూరు చేయడంతో పాటు ప్రహరీకి కూడా నిధులు మంజూరు చేసి పాఠశాల చుట్టూ సత్వరమే ప్రహరీ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



● పాఠశాలలోకి వెళ్లేందుకు అప్పట్లో నిర్మించిన సీసీ రోడ్డు



● స్థానిక గృహాల పక్కన కూలిన ప్రహరీ



● మల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మార్కెట్లో భగభగలు!!

సలసలా కాగుతున్న వంట నూనెల ధరలు

● దిగుమతి సుంకం పెంచడంతో భారీగా పెరిగిన ధరలు
● పండుగలు, పెళ్లిళ్ల వేళ ధరల పోటు
● బెంబేలెత్తిపోతున్న మహిళలు, వినియోగదారులు



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వంట నూనెలు

మద్నూర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): దిగుమతి సుంకం పెంచడంతో భారీగా పెరిగిన వంట నూనె ధరలతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. వంట నూనెల ధరలు ప్రస్తుతం మార్కెట్లో మండిపోతున్నాయి. రోజురోజుకు ధరలు పెరుగుతూ వినయోగదారులకు దడ పుట్టిస్తున్నాయి. పండుగలు శుభ కార్యాల వేల వంట నూనెల ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. గత నెల క్రితం లీటరు పామాయిల్ రూ.90 నుంచి రూ.95 ఉండగా, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.110 నుంచి రూ.115 ఉండగా.. ప్రస్తుతం పామాయిల్ రిటైల్ మార్కెట్‌లో లీటరు రూ.135లకు, సన్‌ఫ్లవర్ రూ.145లకు చేరింది. అంతేకాకుండా మన దేశీయ అవసరాలకు పాంఆయిల్, సన్‌ఫ్లవర్, నూనెలను ఎక్కువ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్న సంగతి తెలిసిందే!! ఈ క్రమంలో దేశీయంగా పామాయిల్ ధరలు, సాగు పెంచేందుకు గాను ఇటీవల కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఒకేసారి 20 శాతం పెంచింది. దీంతో ఒక్కసారిగా వంట నూనెల ధరలు భగ్గుమన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ, నూనె లీటరు ధర రూ.170 నుంచి 190 వరకు, ఆవ నూనె రూ.200నుంచి రూ.210 వరకు పూజలకు ఉపయోగించే దీపారాధన, నువ్వుల నూనె సైతం లీటరు రూ.150 వరకు పెరిగాయి. అంతేకాకుండా 15 లీటర్ల సన్ ఫ్లవర్ గత నెలలో రూ.1750 కాగా, ప్రస్తుతం రూ.2250లకు చేరింది. ప్రాంతాలను బట్టి రిటైల్ మార్కెట్‌లో లీటరుకు సుమారు రూ.5 అదనంగా భారం పడుతుండటంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రసుత్తం పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో నూనెలపై ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు భయపడుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా మన దేశీయ అవసరాలకు ఇతర దేశాలన ఉంచి భారీగా దిగుమతి చేసుకోవడంతో ధరల పెరుగుదల నమోదవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మన దేశంలో వంట నూనె, గింజల ఉత్పత్తి కేవలం 5 శాతమేనని, విదేశాల నుంచి దిగుమతి మిగతా 95శాతం దిగుమతి ఉండటంతో పాటు దిగుమతి సుంకాలు, లోకల్ రవాణా చార్జీలు, జీఎస్టీ వ్యాపారుల కమీషన్, రిటైలర్ లాభాల మార్జిన్‌లు అదనంగా ఉండటంతో ధరలు పెరుగుదలకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఫోకస్

● పూర్తిస్థాయిలో పుస్తకాలు లేక ఖాళీగా ఉన్న అల్మారాలు



టీయూ లైబ్రరీలో పుస్తకాల కొరత

● పోటీ పరీక్షల పుస్తకాలను సైతం అందుబాటులో ఉంచాలని విద్యార్థుల డిమాండ్

డిచ్‌పల్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో పోటీ పరీక్షల పుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం జాబ్ క్యాలండర్ ప్రకటించిన నేపథ్యంలో దానికి అనుగుణంగా పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. కానీ తెలంగాణ వర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో పుస్తకాలు అందుబాటులో లేక విద్యార్థులు బయట బుక్ స్టోర్‌ల నుంచి కొనుగోళ్లు చేస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారు. వర్సిటీలో చదువుతున్న వారందరూ.. అధిక శాతం గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులే. విద్యార్థులు పుస్తకాలు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెంట్రల్ లైబ్రెరికి విశాలమైన భవనం ఉన్న అందులోని కొన్ని హాల్‌లను మూసి వేశారు. ప్రస్తుతం చదువుకోవడానికి రెండు హల్స్ ఉన్న అవి విద్యార్థులకు సరిపోవడం లేదు. మూసి వుంచిన హాల్‌ను శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకొస్తే విద్యార్థులకు సౌకార్యంగా ఉంటుందని విద్యార్థులు కోరుతున్నారు. ఇప్పటికైనా వీసీ, రిజిస్ట్రార్‌లు స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా లైబ్రరీ చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, పిచ్చి మొక్కలు పెరగడంతో తరచుగా లైబ్రరీలోకి పాములు, విషకీటకాలు వస్తున్నాయని, పరిసరాలను శుభ్రం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.



తెలంగాణ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ



లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి

: శీను నాయక్, టీయూ విద్యార్థి, డిచ్‌పల్లి



లైబ్రరీలో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం. ప్రభుత్వం జాబ్ క్యాలండర్ ప్రకటించినందున అందుకు సంబంధించిన పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి. ఇప్పటికే ఈ విషయం చాలా సార్లు గత వీసీ, రిజిస్ట్రార్‌లకు తెలియడం జరిగింది. అయినా ఎలంటి స్పందన లేదు. అలాగే లైబ్రరీలో సౌకర్యాలు మెరుగు పర్చాలి. లైబ్రెరియన్ విద్యార్థులకు సహకరించడం లేదు. పుస్తకాల గురించి అడిగితే తమ వద్ద అలాంటి ప్రస్తావన తేవద్దని, ఏదైనా ఉంటే వీసీ, రిజిస్ట్రార్‌ల వద్ద తేల్చుకోవాలని సూచించడం సరికాదు.

ఇంటర్ కాలేజీకి నోచుకోని డొంకేశ్వర్

జర దేఖో!!



● డొంకేశ్వర్ మండల కేంద్రం ప్రధాన ద్వారం

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

డొంకేశ్వర్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండల కేంద్రంలో ఎనిమిదేళ్ల నుంచి ఇంటర్ ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. గత ఎనిమిదేళ్లుగా కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.దానికి తోడు నూతనంగా మండల ఏర్పాటుతో ఆ ప్రతిపాదన కాస్త మరింత బలమైంది. మండల కేంద్రంలో కళాశాల అందుబాటులో లేక పక్క మండలాలకు వెళ్లి చదువుకోలేక స్థానికంగా ప్రైవేటు కళాశాలల్లో చేరే స్థోమత లేక పదవ తరగతి పాసైన విద్యార్థులు కొందరు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త కళాశాల ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఓ ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రక్కగా పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌లో చేరేందుకు మండలంలో కళాశాల లేకపోవడంతో పేదవిద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ప్రైవేటు కళాశాలలో ఫీజులు చెల్లించే స్తోమత లేని విద్యార్థులు చదువుకు దూరంగా అవ్వాల్సిన దుస్థితి నెలకొంది.

● ప్రతీ ఏటా వందల్లో విద్యార్థులు పదవ తరగతి ఉత్తీర్ణత

2023-24విద్య సంవత్సరానికి సంబంధించిన మండల వ్యాప్తంగా పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విదాయర్థుల సంఖ్య గతంలో పోలిస్తే గణనీయంగా పెరిగింది. 2003 మార్చిలో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్షలకు మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రవేటు విద్యాలయాల నుంచి మొత్తం 166మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అధిక శాతం విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. అధిక శాతం బాలికలే ఉన్నారు. ఉన్నత విద్య కోసం ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడ ప్రభుత్వ కళాశాలలు లేనందున ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే, పదవ తరగతి పూర్తి కాగానే ప్రతీ సంవత్సరం జిల్లాలోని వివిధ ప్రైవేటు కళాశాలకు వేలల్లో ఫీజులు చెల్లిస్తూ విద్యార్థులు చదువును సాగిస్తున్నారు. మండల కేంద్రంలో కళాశాల ఏర్పాటు చేస్తే చదువుకోవడానికి సలువుగా ఉంటుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కళాశాల ఏర్పాటు అయితే పేదవిద్యార్థులకు వరంగా ఉంటుంది. ప్రైవేటు కళాశాలల్లో వేలల్లో ఫీజులు చెల్లించి చదువుకునే పరిస్థితి నుంచి పేదవిద్యార్థులకు విముక్తి కలుగుతుంది. ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టిసారించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ కాలేజీ లేకపోవడంతో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి

: పోతుంటి సురేందర్, స్థానికుడు, డొంకేశ్వర్



విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మండల కేంద్రంలో ఇంటర్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎనిమిదేళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నాం. ఇంటర్ కాలేజీ ఏర్పాటు చేసినట్లయితే చుట్టు పక్కల గ్రామాల ఎస్సారెస్పీ ముంపు గ్రామాలు కాబట్టి కనీసం గ్రామాలకు బస్సు సౌకర్యం కూడా లేని గ్రామాలు ఉన్నాయి. అధిక సంఖ్యలో బాలికలే ఉన్నందున చదువుకోవడానికి ఇబ్బంది పడుతుంది. ఇంటర్ కళాశాల లేనందున ప్రతీఏటా డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి.

తబ్లికె జమాతే ఇస్తెమ కోసం స్థలం పరిశీలన



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):నగరంలోని సారం గపూర్ తబ్లికె జమాతే ఇస్తెమ కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ శనివారం స్థలాన్ని పరిశీలించారు. సారంగపూర్‌లో జనవరిలో జరిగే జమాతే ఇస్తెమ సభకు స్థలాన్ని పరిశీలించి రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రాష్ట్రాలు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి 2లక్షల మందితో దాదాపు వంద ఎకరాలు సభను నిర్వహించనున్నందున ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేయడానికి కసరత్తు మొదలు పెట్టారు. సభకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట నుడా చైర్మన్ కేశవేణు, ఇతర నాయకులు ఉన్నారు.

దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న నగర మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంధుల వనరుల కేంద్రంలో మహిళా సెక్స్ వర్కర్లతో మహిళా సాధి కారత మహిళా ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశ ఆర్థిక పురోగతిలో మహిళల పాత్ర కీలక మని ప్రస్తుత సమాజంలో ప్రతీ మహిళ పురుషులకు దీటు గా ముం దుంటున్నారని అన్నారు. ఈ సదస్సులో మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ ఎంఈ-డీఎఫ్‌వో అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్‌కుమార్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, గాంధీ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర వరోరా అసెంబ్లీ సమన్వయకర్తగా గన్‌రాజ్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏఐసీసీ అసెంబ్లీ కోఆర్డినేటర్లను నియ మించింది. నగరానికి చెందిన మాజీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు గన్‌రాజ్‌ను మహారాష్ట్రలోని వరోరా అసెంబ్లీకి కోఆర్డినేటర్‌గా నియమించారు. చంద్రాపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని వరోరా అసెంబ్లీ నియోజకవర్గానికి సమన్వయకర్తగా నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్, సీఎం, పీసీసీ అధ్యక్షుడికి జిల్లాకు ధన్యవాదాలు తెలిపారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టిపిటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, డీఏ బకాయిలను వెంటనే ఆమోదించి మంజూరు చేయాలన్నారు. ఉప విద్యాశాఖ అధికారులను వెంటనే నియమించాలని, డైట్, బిఈడి కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు.కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని, రెసిడెన్షియల్ పాఠశాలలన్నింటిని కూడా సాధారణ పాఠశాలల సమయాన్ని పాటించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనా రాయణ, చందర్, అర్వింద్, అలీమ్, మల్కన్న, మల్లేషం పాల్గొన్నారు.

న్యాలకల్‌లో వ్యక్తి ఆత్మహత్య

మోపాల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి):మోపాల్ పోలీసు స్టేషన్ పరిధిలోని న్యాలకల్ గ్రామానికి చెందిన పల్లే నవీన్(37)అనారోగ్యంతో శుక్రవారం రాత్రిసమీపంలోని వెంచర్‌లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ యాదగిరిగౌడ్ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా వెన్నుముఖ వ్యాధితో బాధపడేవాడు. ఆపరేషన్ చేయించుకున్నప్పటికి తగ్గకపోవడంతో మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సాత్విక ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నేడు దేగాంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆర్మూర్‌రూరల్, నవంబరు9ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం దేగాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు దేగాం, మిర్దాపల్లి, రాంపూర్ గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.అంతరాయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

ఘనంగా గోపాష్టమి పూజలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):కార్తీకమాస గోపాష్టమిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు సాగాయి. శనివారం నగరంలోని వివిధ ప్రాంతా లలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక మంలో పరిషత్ ప్రతినిధులు ఆనంద్, ధాత్రిక రమేష్, నికేష్, సుధీర్, పాల్గొన్నారు.

గొప్ప నాయకత్వాన్ని అందించిన భారతదేశం

నిజామాబాద్ కల్చరల్,నవంబరు 9(ఆంధ్రజ్యోతి):ప్రపంచానికే భారతదేశం గొప్ప నాయకత్వాన్ని అందించిన దేశమని అలాంటి దేశంలో ఎందరో మహోన్నతమైన వ్యక్తుల జీవిత చరిత్రలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని రాష్ట్రీయ స్వయం సేవక్ ఇందూరు విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు నిర్వహించిన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ చరిత్ర సంఘర్షణ చరిత్ర అని ప్రపంచంలో ఏదేశానికి వెళ్లిన భారత దేశ మూలాలు ప్రభావితం చేస్తాయని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో దేశ చరిత్రలోని సువర్ణ అక్షరాలతో లిఖించదగిన సంగ్రామం వీర సావర్కర్ రాసిన పుస్తకం అని అన్నారు. ఆయన రాసిన పుస్తకాన్ని చదివితే ప్రతీ భారతీయుడి రక్తం ఉడికిపోతుందని అన్నారు. నేటి యువత దేశ ధర్మ రక్షణ కోసం నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తు చేశారు. భారతదేశం తన యొక్క అస్తిత్వాన్ని, సంస్కృతి మూలాలను చరిత్రను మలుచుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ భారతీయుడిపైన ఉందని అన్నారు. ఆర్ఎస్ఎస్ గత వంద సంవత్సరాలుగా సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు విభాగ్ కార్యవాహ రాజుల్ వార్ దిగంబర్, గజానన్ తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్రీయ స్వయం సేవక్ ఇందూరు విభాగ్ ప్రచారక్ వెంకట శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విభాగ్ ప్రచారక్

16, 17 న మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం జరుగు తుందని ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ అన్నారు. శనివారం ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 70ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడు లేని విధంగా మొట్టమొదటిసారి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు కెప్టెన్ బ్యాడ్మింటన్ హబ్‌లలో రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయని ఈనెల 13 వరకు టోర్నమెంట్‌లో పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 33 జిల్లాల నుంచి 300లకు పైగా టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటాయని అన్నారు. 35 ఏళ్లకు పైబడి 70 సంవత్సరాల వరకు గల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. కనివిని ఎరుగని రీతిలో రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలిపేలా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధ్యక్షతన ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అంతకుముందు కలెక్టర్‌ను కలిసి పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించినట్లు ఆయన తెలిపారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోటీలను విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు, ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి సత్యనా రాయణ, కోశాధికారి గంగాకిషన్, డిల్లీ దాస్, ఏటీఎస్ శ్రీనివాస్, తది తరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రెంజల్,నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయన్న తెలిపారు. శుక్రవారం రాత్రి కందకుర్తి నుంచి బోర్గాం వైపు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్ఐ సాయన్న, సిబ్బంది వెళ్లి రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

బీసీ ఉపాధ్యాయ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

నిజామాబాద్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నగరంలోని కేర్ కళాశాలలో రాష్ట్ర సలహాదారు రమణస్వామి ఎన్నికల అధికారిగా వ్యవహరించి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వినోద్‌కుమార్, కార్యదర్శిగా ఆర్.గోపాలకృష్ణలుమరోసారిఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ తనను మరోసారి జిల్లాఅధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని,సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్ సీజ్

సిరికొండ,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రావుట్ల బీట్‌లో కంపార్టుమెంట్ 394లో అటవీ భూమిని చదును చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు శనివారం పట్టుకుని సీజ్‌చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిరికొండ రేంజ్ రావుట్ల సెక్షన్‌లోని 394 కంపార్టుమెంట్‌లో శనివారం అటవీ భూమిని ఆక్రమించి చదునుచేస్తున్నారని అందిన సమాచారం మేరకు ఇన్‌చార్జి రేంజ్ అధికారి రవీందర్, రావుట్ల ఇన్‌చార్జీ సెక్షన్ అధికారి కృష్ణగీత్‌బీట్ అధికారి శ్రీకాంత్ తదితరులు వెళ్లి పరిశీలించగా భూమిని చదును చేస్తున్న జరుపుల మోహన్‌కు చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి సిరికొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి రవీందర్ మాట్లాడుతూ అటవీ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు,ట్రాక్టర్‌లను సీజ్ చేస్తామన్నారు.

భీమ్‌గల్‌లో ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం

భీమ్‌గల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి):పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీలింబాద్రి గుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం మూడో రోజు శ్రావణప్రయుక్తా క్షీరాభిషేకం నిర్వహించగా శ్రీలక్ష్మీ నర్సింహ ఉత్సవమూర్తులకు నంబి పురోహితులు పాలతో అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం దేవతమూర్తులను బంగారు నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో అర్చక బృందం యాగ్నిక బృందం, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. అనంతరం నరసింహ ఏకాక్షరి హవన కార్యక్రమంలో భాగంగా రామాయణ, ఇతిహాస ఘట్టాలను అక్షరభ్యాస చార్యులచే భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నంబి పార్థసారథి, విజయసారథి, ప్రవీన్, మహేష్, శ్రీనివాస్, అర్చక బృందం పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

సుభాష్‌నగర్,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా మండ ల, గ్రామాల వారిగా కమిటీలు వేసి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కన్వీనర్ దేగాం యాదాగౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈనెల 24వ తేదీ నుంచి పార్లమెంట్ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పెంచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, గోపిడి రాజన్న, సోమ్‌నారాయణ, బొబ్బ నర్సింహారావు, రెంజర్ల సురేష్, జ్యోతినారాయణ, అంబిక సత్యనారాయణ, వీరాచారి, బ్రహ్మానందచారి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక విశిష్టతను తెలిపిన హరికథా గానం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రంగా విరాజిల్లుతున్న జెండా బాలాజీ మందిర్‌లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శనివారం నిర్వహించిన హరికథా గానం కార్తీకమాస విశిష్టతను తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు, ఆలయ చైర్మన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీనివాసుని కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఏడుకొండల వాడా వెంకటరమణ గోవిందా... గోవిందా... అనాథ రక్షక గోవిందా... గోవిందా... అంటూ భక్తుల నామస్మరణతో శ్రీనివాసుని కార్తీకమాస కల్యాణోత్సవం కన్నుల పండుగగా సాగింది. వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ మందిర్‌లో నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు ఆద్యాంతం గోవింద నామ స్మరణల మధ్య కల్యాణోత్సవం సాగింది. అర్చకులు వెలగలేటి నాగరాజాచార్య కల్యాణంలోని ముఖ్య ఘట్టాలైన పాదప్రక్షాలన మధుపర్కం, జీలకర్ర, బెల్లం, కన్యాదానం, మాంగళ్య సూత్రధారణ, మాలాపరివర్తన, తలంబ్రాలు, బ్రహ్మముడి తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు, ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు పూజలు చేస్తున్న దృశ్యం

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ఖిల్లా, నవంబరు9(ఆంధ్రజ్యోతి):చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆరో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. ఆరవ టౌన్ ఎస్ఐ వెంకటరావ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శాస్త్రినగర్‌కు చెందిన సంపంగి వెంకటి(19)అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు మహ్మద్ గౌస్‌తో కలిసి శుక్రవారం సమీపంలోని కుంటలో చేపలు పట్టడానికి వెళ్లారు.కాగ చీకటి పడ్డ వెంకటి ఇంటికి తిరిగి రాక పోవడంతో గౌస్‌ను వెంకటి అన్న బాలాజీ నిలదీయడంతో చేపలు పట్టడానికి కుంటలోకి దిగిన వెంకటి బయటకు రాలేదని తర్వాత వస్తానని చెప్పినట్లు చెప్పాడు.అనుమానం రావడంతో కుంటవద్దకు వెళ్లి చూడగా వెం కటి మృతి చెంది ఉన్నాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా శనివారం కుంట నుంచి వెంకటి మృతదేహాన్ని బయటకు తీశారు.మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహితపై అత్యాచారం

● బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు ● వివరాలు గోప్యంగా ఉంచిన పోలీసులు

నందిపేట, నవంబరు 9: మండ లంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత (35)పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితపై ఈ నెల 6వ తేదీన అరుణ్, ముత్యం అనే ఇద్దరు వ్యక్తులు అత్యా చారం చేశారు. కానీ సదరు మహిళ మంత్రాలు చేస్తోందన్న నెపంతో ఆమెపై దాడి చేశామని పుకారు చేశారు. అయితేఘటనపై బాధితమహిళ ఇటీవల ఆర్మూర్ ఏసీపీకి ఫిర్యాదు చేసింది. ఏసీపీ ఆదేశాల మేరకు ఆర్మూర్‌రూరల్ సీఐ విచారణ చేపట్టగా.. వాస్తవాలు వెలుగులోకొచ్చాయి. దీంతో మహిళపై అత్యాచారానికి పాల్పడ్డ ఘటనలో అరుణ్,ముత్యం అనే ఇద్దరితో పాటు వీరికి ఆశ్రయం కల్పించిన మహిళను సైతం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

భక్తులందరికీ సౌకర్యాలు కల్పించాలి

భీమ్‌గల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి):లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్స వాలకు హాజరయ్యే భక్తులందరికి సమాన సౌకర్యాలు కల్పించాలని భీమ్‌గల్ సర్పన మాజీ కమిటీ ఆలయ ధర్మకర్త నంబిపార్థసారథిగా దృష్టికి తీసుకువెళ్లారు.శనివారంనంబి వంశస్తులచే లింబాద్రిగుట్టపై సమావేశం అయ్యారు.గుట్టపైవాహనాల పార్కింగ్ టెం డర్‌ను సంత్సరం పాటు చేపట్టడం వల్ల గుట్టకు వచ్చేభక్తులు ఇబ్బందులు పడతారన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు కూడా పూర్తిస్థాయిలో వివరాల నమోదు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ట్యాబ్ ఎంట్రీ చేసే విధంగా సొసైటీల పరిధిలో ఏర్పాట్లను చేస్తున్నారు. త్వరగా ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు పడే విధంగా ఏర్పాట్లను చేశారు.

● రైతులకు సంబంధించిన బోనస్‌ను మాత్రం తర్వాత ఖాతాల్లో జమ చేయనున్నారు.

సన్నరకాలు అమ్మిన రైతుల వివరాలు తీసుకున్న తర్వాత పౌరసరఫరాల సంస్థ నుంచి ధాన్యం డబ్బులను మొదట జమ చేస్తారు. ఈ డబ్బుల జమ పూర్తయిన తర్వాత ఆ వివరాలను పౌరసరఫరాల శాఖ అధికారులకు పంపిస్తారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా రైతుల వివరాలను బట్టి అమ్మిన సన్నరకం ధాన్యం వివరాల ఆధారంగా క్వింటాలుకు రూ.500 బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేస్తారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మొదట మద్దతుధర ప్రకారం డబ్బులను జమ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. రైతుల నుంచి ధాన్యం కొన్న వారం రోజుల్లోపే ఖాతాల్లో డబ్బులు వేసే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం చేశామని పౌరసరఫరాల సంస్థ డీఎం అంబదాస్ రాజేశ్వర్, పౌరసరఫరాల శాఖ అధికారి అర్వింద్‌రెడ్డి తెలిపారు. ప్రతీరోజు ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లను చేశామన్నారు. ధాన్యం సన్నం, దొడ్డు రకాలు కొనుగోలు చేసేందుకు వేరు వేరు కేంద్రాలను ఏర్పాటు చేయ డంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొన్న ధాన్యానికి త్వరగా డబ్బులు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు.

పర్యటనలే తప్ప పట్టింపేదీ?

(మొదటి పేజీ తరువాయి)

తెప్పలు విడుస్తూ పితృ కర్మలు నిర్వహిస్తుంటారు.

● పట్టించుకునే వారేరీ.?

ఇంతటి మహిమాన్వితమైన పుణ్యక్షేత్రాన్ని నాటి పాలకులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత అయిన అభివృద్ధి చెందుతుందనుకున్నారు. కానీ అనుకున్నంతగా అభివృద్ధి పర్యటక కేంద్రంగా అభివృద్ధి చేయలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. కేంద్ర పర్యటక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్ రెడ్డి కందకుర్తి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తారనుకున్నా కూడా ఇప్పటి వరకు కందకుర్తి పర్యటన అభివృద్ధపై చర్యలు తీసుకోకపోవడంపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా కందకుర్తి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని రెంజల్ మండల ప్రజలు కోరుతున్నారు.

జాతీయ వాదాన్ని ప్రోత్సహించేది చిత్రం జితేందర్‌రెడ్డి :ఎమ్మెల్యే



సినిమా చూస్తున్న బీజేపీ నాయకులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):జాతీయవాద సిద్ధాంతం, దేశం, ధర్మం, అఖండ భారతదేశమే లక్ష్యంగా పనిచేసిన జితేందర్‌రెడ్డి జీవితం జాతీయ వాదాన్ని ప్రోత్సహిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జితేందర్‌రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన చిత్రాన్ని శుక్రవారం రాత్రి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, అనుచరులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నక్సలైట్లకు ఎదురు నిలిచి ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి జితేందర్‌రెడ్డి అని అన్నారు. పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉండాలంటే వందే మాతరం పాడాల్సిందే అంటూ వామపక్ష విద్యార్థి సంఘాల కమ్యూనిస్టు ముసుగులో దేశద్రోహానికి పాల్పడుతున్న వారి పాలిట సింహస్వప్నంగా నిలిచిన వ్యక్తి జితేందర్‌రెడ్డి అని అన్నారు. అనంతరం వివిధ క్షేత్రాల సంఘ్ పెద్దలతో కలిసి సినిమా గురించి విశ్లేషించారు. అంతకుముందు నగరంలో ప్రదర్శించబడుతున్న థియేటర్ ఎదుట జితేందర్‌రెడ్డి చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు.

మాలల మహాసభను విజయవంతం చేయండి

ఖిల్లా, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి):మాలల వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు రవి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లోగల మాలమహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలు బాధ్యతగా తమ తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మాలల వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం శ్రావ్యగార్డెన్‌లో జరిగే సభకు పెద్ద సంఖ్యలో మాలలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాజేందర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ. 290

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80000	రూ.73800	రూ.965

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : అమరన్ (12.00, 6.45, 10.15)
: క (3.30)
స్ర్కీన్-2 : అమరన్ (10.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (1.30)
: లక్కీ భాస్కర్ (4.15, 7.30, 10.45)
స్ర్కీన్-3 : సింగం అగేన్ (హిందీ) (10.50)
: ధూంధాం (2.00)
: అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (5.00)
: జితేందర్ రెడ్డి (7.45)
: క (10.45)
స్ర్కీన్-4 : బూల్ బులియా-3 (హిందీ) (10.00, 7.05)
: వంచన (1.25)
: బ్లడీ బగ్గర్ (4.05)
: సింగం అగేన్ (హిందీ) (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : అప్పుడో ఇప్పుడో ఎప్పుడో (10.35)
: లక్కీ భాస్కర్ (1.30, 7.30)
: క (4.30, 10.30)
స్ర్కీన్-3: అమరన్ (10.30, 4.20, 7.30, 10.30)
: జితేందర్‌రెడ్డి (1.40)

దేవి : లక్కీ భాస్కర్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: అమరన్ (11.15, 6.15)
: సింగం అగేన్ (హిందీ) (2.15, 9.15)
విజయ్ : క (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్